# ప్రభావతి

(పింగళి సూరన్న ప్రభావతీ ప్రద్యుమ్నం ఆధారంగా ఏకపాత్రం.)

---

(ఉద్యాన వనం, ఉదయ వేళ సూచించే ధ్వనులు....)

"నిజంగా? జగదంబ, పార్వతీదేవి, కలలో కనబడ్డదా? ఎంత అదృష్టం:" అంది రాగవల్లరి: అణచుకొంటున్న ఉత్సాహంతో. 'ఎప్పుడూ' అంది మళ్ళీ.

"తెల్లవారుఝామునా?" అడిగింది కొసరుతూ.

"తెల్లవారుతుంటేనోయ్" అన్నాను. ఉత్సాహం, ఉద్రేకం, ఏదో తెలిసీ తెలియని 'ఇది' నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.

నేనుట, పూజచేస్తున్నానుట. పూజపూర్తయి, మంగళ హారతి యిచ్చాను. హారతిపళ్ళెం పూజాపీఠం మీద వుంచి, మంగళహారతిని కన్నులకు అద్దుకుంటున్నానోయ్. హారతి దీపజ్వాల, ఘనీభవించి, మనుష్యా

కారం తాల్చినట్లు అయింది. ఎర్రని పాదాలు, ఎర్రని చీర, ఎర్రని పూల మాలలు, ఎర్రని కిరీటం — సర్వారుణ, సర్వమంగళాదేవి ప్రత్యక్షం అయింది. ఆ చల్లని తల్లిని చూచి ఏవేవో స్తోత్రాలు చదివాను. ఆమె, ఆ జగదంబ, 'ప్రభా!' అంది—తలెత్తాను. ఆమె కన్నులు నవ్వుతున్నాయి. పరమేశ్వరి ఒక చేత్తో నా తల నిమురుతూంది. 'నీకు నిరుపమానసామిని భర్తగా సంఘటన చేస్తున్నాను' అంది. ఆశ్చర్య పోతున్నాను. "అంతటి భర్త, ఆ త్రిలోక సుందరుడు భర్త కావడం నీ అదృష్టం. మీ యిద్దరి అనురాగమూ కలకాలం ప్రజలు చెప్పుకుంటారు. మీ బిడ్డ—మీ రాజ్యాన్ని ఏలుతాడు" అంది. చేతులు జోడించి నమస్కరించాను.

"నీ పతి ఎట్లావుంటాడో చూడాలనుందా?" — అన్నదా జగదంబ! సంకల్ప మాత్రంతో ఒక చిత్తరువును సృష్టించారామె. 'చూసుకో'అన్నారు. మెలకువ వచ్చేసింది.

కాకులూ చిలకలూ కలిసి కూస్తున్నాయి. నెమళ్ళు భయంకరంగా కేకింకారాలు చేస్తున్నాయి. జగదంబకు నమస్కరించి కన్నులు తెరిచాను. ఎదురుగా చిత్రపటం, అతిలోక మోహనుడు, ఎవరో!

ఈయనేనా, కాబోయే భర్త? సిగ్గువేసింది, సిగ్గు సిగ్గుగానే, ఆ చిత్తరువును చూచాను. వొళ్ళు ఝల్లుమంది. పక్కకు తిరిగాను. అటూ యిటూ తిరిగాను. ఎటు తిరిగినా, ఆ చిత్తరువు నన్ను చూస్తున్నట్లే వుంది. నే నా చిత్తరువును చూడలేక పోతున్నాను. చిత్తరువు నన్ను చూస్తూనే ఉంది. గట్టిగా కళ్ళు మూసుకున్నాను. మూసుకున్నాను కన్నులు., మూసుకోగలనా హృదయం! మనస్సును మూసుకోగలనా? బయటి చిత్తరువు మనస్సంతా నిండింది! చిత్తరువును చూడలేక పోతున్నాను ఈ జగదేక సుందరుడు నన్ను చూసి నవ్వుతున్నాడా? ఉడికిస్తున్నాడా? చూడలేక గొసెన కప్పాను చిత్తరువుపై. అబ్బ! చెప్పలేను, చెప్పుకోకుండా ఆగలేను....

అంతా విని, రాగవల్లరి తీవ్రంగా చూస్తోంది, ఆలోచనగా. ఎదురుగా ఒక హంస వయ్యారంగా నడుస్తోంది. 'ఏదీ చిత్తరువు?' అంది రాగవల్లరి హఠాత్తుగా.

"ఏం?" అన్నాను. 'ఎవరన్నా చూస్తే ప్రమాదం. మీ తండ్రి వజ్రనాభుడు మహాకఠినుడు! అయినా కన్ను పోయేంత కాటుక పెట్టుకోవటం దేనికి?' అంది. గురివింద పొదలో దాచిన చిత్తరువును తెచ్చి చూపించాను. రాగవల్లరి నిదానించి చూచింది. చూచి, చూచి, చూచి 'నీ అదృష్టం'అంది.

నాన్న పేరు చెప్పి, భయపెట్టి, యింతలో అదృష్టం అంటుందేమిటి? యింతే, ఎవరైనా. వాళ్ళ ఆలోచనలే వాళ్ళవి కాని—

"ఒక చెఱుకు విల్లు, పూవుబాణంగూడా చిత్రిద్దాం....ఎవరు చూచినా ఏం అనుకోరు...."అంది రాగవల్లరి! ఎంతైనా, మంత్రి కుమార్తె మరి! సమయస్ఫూర్తి అట్లా ఉండాలి. చిత్రించాం. చిత్తరువుకు, జీవకళ సంపూర్ణంగా వచ్చింది కాని—

కాని—

కాని, నిజంగా యిట్లాంటి వరుడు ఉంటాడా? ఉండి ఉండడు. నాన్నగారు ఎందరెందరి వరుల చిత్రపటాలో తెప్పించారు. ఈ నవమన్మథమూర్తి నిజంగానే ఉండి ఉంటే, యీయన చిత్రపటమూ తెప్పించేవారే– వజ్రపురాధీశ్వరుడు కోరితే, ఏది జరగదు! నాన్నగారు, నాకోసం ఏం చెయ్యరు? వృత్తది ఇది. జగదంబ చేసిన పరీక్ష. నా మనస్సును మథించి, మథించి గాని—ఏమిటో, వేల్పులు పరీక్ష చేసి గాని, వరాలు యివ్వరంటారు. ఇది గూడా ఒక పరీక్షేమో—ఎందుకో ఈ పరీక్ష. ఏమిటో పరమేశ్వరి కృప!

అంతఃపురం, రాణివాసం. రాణివాసంలో వుండేవారికి బయటి ప్రపంచం సంగతులు ఏం తెలుస్తాయి? ఏమిటో సర్వ సౌఖ్యాలూ అనుభవిస్తున్నా, ఉన్నా, ఏదో తెలియని వెలితి వెంటాడుతూనే ఉంటుంది.

తెల్లవారుతూంది. నిమిషం నెలగా, సంవత్సరంగా గడుస్తూంది. కాస్తయినా తెరిపి కలుగుతుందేమో మనస్సుకు — అని కాసారం దగ్గిరికి వెళ్ళాను. రాగవల్లరి సాయంగా వెంట వచ్చింది.

కాసారం మామూలుగా, విచ్చిన పూలతో, తెరలెడి జలపూరాలతో వుంది. పచ్చని చెట్లు, వాటిని ఒరిసి వీచేగాలి, పర్ణాల గలగలలు బాగానే వున్నాయి. ఏం లాభం? నా మనస్సే బాగా లేనప్పుడు? మళ్ళీ మళ్ళీ చిత్తరువును చూస్తున్నాను. జగదంబ నిర్మించి యిచ్చిన ప్రసాదం అని పూజ్యభావం. భర్తగాకెదని ప్రేమ. చిత్తచోరుడు ఈయనేనా అని ఉత్కంఠ. అన్నీ కలిసి, నిలువు నిలువునా సిగ్గు, తహతహ- మళ్ళీ మళ్ళీ చూస్తున్నాను. కన్నులు మూసుకున్నాను. గుండెల్లో చెయ్యివేసి కలుస్తున్నట్లుంది. కన్నులు తెరచి చూచేసరికి -హంస. ఈ హంస ఎందుకు వచ్చింది యిక్కడికి?

ఏం ఎందుకు రాకూడదు? కాసారం దగ్గర హంసయుండక కాకులుంటాయా? ఈ హంసను ఎక్కడో చూచినట్లుంది! ఏమో, ఒకవేళ చూచినా, హంసల్నిగూడా వేర్వేరుగా గుర్తించగల నేర్పు ఉందా నాకు!

పండి, పచ్చనై ఉన్న చేలు అన్నీ ఒకటిగా ఉంటాయి నాకు. ఎవరి పొలం ఏదో, ఎట్లా తెలుస్తుంది? అని అడిగినందుకు, నాన్నగారుగూడా నవ్వారు.

అడ్డంగా, ఒయ్యారంగా, సుతారంగా- సొగసుగా నడుస్తోంది. ఈ హంసతో ఏమన్నా పొద్దుపోతుందేమో.

'హంస'ను పట్టుకుంటే....నాకు పొద్దుపోటానికి ఒకర్ని హింస పెట్టటమా? తప్పు. ఏ ప్రాణి స్వేచ్ఛ ఆ ప్రాణిది.

ముద్దులు కులుకుతూ దగ్గరగా వస్తోంది హంస. ఇదీ బాగానే ఉంది. రమ్మని చేయిచాచాను. 'దా, దా' అని పసిబిడ్డణ్ణి పిలిచినట్లు గోముగా పిలిచాను. హంస వచ్చింది.

ఓః! పిలిస్తేనేగాని పక్షిగూడా రాలేదు. వాటికీ అహంకారం, గౌరవం, తెలివితేటలు, ఇంగితజ్ఞానం ఉంటాయి కాబోలు.

హంస అదేపనిగా చిత్తరువుకేసి చూస్తోంది. ముద్దుగా హంస మెడ నిమిరాను, రెక్కలు దువ్వాను. పసిబిడ్డ. సమాధానం చెప్పలేదని తెలిసి గూడా ప్రశ్నలు అడిగినట్లు, 'ఏం అట్లా చూస్తున్నావు, నీకు ఈయన తెలుసా?' అన్నాను. నా మాటలు విని. నేనే నవ్వుకున్నాను.

"తెలుసు" అంది హంస.

అరె! హంస మాట్లాడుతోంది. పైగా, తనకు 'తెలుసుట'— ఆఁ,

నేనే గెలిచాను అంది రాగవల్లరి.

'ఈ చిత్రపురుషుడు భూమ్మీద లేడు' అన్నాను నేను. 'ఉండి ఉంటాడు' అంది రాగవల్లరి.

"పందెం అంటే పందెం'—అనుకున్నాం. ఆ మాట అప్పగిస్తోంది రాగవల్లరి.

"హంసకు, ఏమి తెలుసో........? ఎవర్ని చూచి ఎవరనుకుంటోందో ?"

హంసకు నా మనోగతాభిప్రాయం తెలిసినట్లుంది. యింకా పరిశీలనగా చిత్తరువును చూచింది. "అవునవును" అంది. 'ఆఁహాఁ, వారే సందేహం లేదు' అంది.

నా గుండెల్ని ఎవరో అదిమినట్లు అయింది—ఇదేమన్నా మాయ, ఎవరిదైనా పన్నాగమా? కల రావడం, కల కల్ల కాక, నిజంకూడా అయ్యేట్టుండడం, హంసలు మాట్లాడడం.... యిదంతా ఏమిటోగా ఉంది. ఈ చిత్రగత పురుషుడెవరు ? ఈ హంస ఎవరు ? యిదంతా ఏమిటీ నాటకం ?

హంస అటూ ఇటూ చూచి తక్కుతూ, తారుతూ, రెక్కలు విద ల్చింది. ఆకాశాని కేసి చూస్తోంది. చేతికి చిక్కిన హంస కాస్తా ఎగిరి పోతుంది కాబోలు!

హంసను ఒడిసి పట్టుకున్నాను. అక్కున చేర్చుకున్నాను. ఎంత బావుంది!

ప్రాణులు, ప్రాణుల చెలిమిని కోరుతాయి! ఈ హంస మరీ చిత్రం.

'పిలిస్తేగాని రాదు. బతిమాలితేగాని— ఏమీ చెప్పదు కాబోలు' అని పించింది.

హంసను బుజ్జగించాను. రాగవల్లరి అందుకొని—

"హంసా...." అంది.

"నేను హంసిని, నా పేరు శుచిముఖి" అంది హంసి. స్త్రీకి సహాయం స్త్రీవల్లనే కావాలి. 'హంసి' అని తెలియగానే ప్రాణం లేచి వచ్చినట్లు అయింది.

రాగవల్లరి కేసి చూచాను. రాగవల్లరి ఏ కళనున్నదో గాని, అందు కుని,

"హంసీ! మా మాట విను. మేమిద్దరం ప్రాణస్నేహితులం. యీ క్షణం నుంచీ, మనం ముగ్గురం ప్రాణస్నేహితులం.... నీకూ మాకూ తేడా లేదు" అంది. హంసి నమ్మినట్లు లేదు. నేను, శుచిముఖిని చేతుల్లోకి తీసు కుని— ఆ మాటలే సప్రమాణంగా చెప్పాను. శుచిముఖి మెత్తబడింది.

"ఈ పురుషుడిది ద్వారకానగరం" అంది. మా కన్నులకు ఎన్నడూ చూడని ద్వారకా పట్టణం తనంత తానుగా కనబడుతున్నట్లుంది. ద్వారకా నగరం, ద్వారకా నగరం....

"ద్వారకను శ్రీకృష్ణుడు పరిపాలిస్తారు. ఆయనకు పదహారువేల మంది భామినులు. వారిలో ఎనమండుగురు మహిషులు....ఆ అష్ట మహిషులలో రుక్మిణీదేవి, పట్టపురాణి. ఆమె కుమారుడు ఈ ప్రభువు!" అంది శుచిముఖి ఒక్కొక్క మాటగా.

"పేరు?" అంది రాగవల్లరి.

"ప్రద్యుమ్నుడు!" అంది శుచిముఖి.

కలలో జగదంబ ఈపేరు చెప్పినట్లుంది. అనుమానం ఏముంది? చెప్పింది.

పరమేశ్వరి మాట మరి.

పరమేశ్వరి మాట, పక్షి శిరోమణి, శుచిముఖి మాట - రెండూ ఒక్కటయ్యాయి.

శుచిముఖి మాటలమీద గురి కుదిరినమాట నిజం! ఇంతకూ ఈ శుచిముఖి ఎవరు? ఎందుకు యిక్కడికి వచ్చినట్లు?

హంసి కాలికి గండపెండేరం వుంది. రాగవల్లరి చూచింది. చదివింది. ఇది ఈ హంసి సరస్వతీ ప్రసన్నురాలు. కావచ్చు. దేవతలు, మా సంపదచూచి కన్నుకుట్టి, ఏమైనా పిచ్చి ప్రయత్నాలు చెయ్యటం లేదు గద!

ఏం చేస్తారు? ఏం చేసినా నెగ్గలేరు. నాన్నగారి తపః ప్రభావం అట్టిది. వజ్రపురంలో ప్రవేశించాలంటేనే, వజ్రనాభుని అనుమతి కావాలి. ఎవరికైనా సరే. ఈ హంసికైనా సరే. ఆ ధైర్యం ఉంది గనుకనే, ధైర్యంగా మాట్లాడుతున్నాను.

హంసిని నమ్మాను. యిందులో ఏమీ మోసం అంటూ లేదు. నాన్నగారు, ఎవర్నీ నమ్మరు. వారే నమ్మి వజ్రపురంలోకి రావడానికి

అనుమతి నిచ్చారంటే—మనకు యింక నిర్భయం! హంసిని, నా నెచ్చెలిని, నా అంతఃపురంలోకి తీసుకుని వెళ్ళాను. నాతో సమానంగా మర్యాదలు జరిపించాను. అటూ యిటూ చూసి హంసనక్కున చేర్చుకొని, ముద్దుగా, గోముగా, ఆశగా, ప్రార్థనగా.

"నా కోర్కె చెల్లించవా ?" అన్నాను.

శుచిముఖి తల ఎత్తి చూచింది. నా కన్నులే, నా మాటలను శుచిముఖికి చెప్పేశాయి. నా గుండెలు కొట్టుకోటమే అంతా వాఖ్యానం చేసి మరీ చెప్పాయి.

'హంసి' తల ఊపింది. "నాకు తెలుసు" అంది.

"ఏం తెలుసో" మరి.

"ఏం తెలుసు ?" అని అడిగాను.

"మీరామాట అంటారని తెలుసు. కాని ?—" ఆగింది.

"ఏమిటి సందేహిస్తున్నావు?"– అనడిగాను.

"ప్రభావతీ, నేను నిన్నెరుగుదును. వజ్రపురానికి ఎప్పుడూ వస్తూ పోతూంటాను. నీ అందానికి ఆ ప్రద్యుమ్నుడే తగినవాడు అని నాకు తెలుసు. నీ సౌందర్యం, ఆ మన్మథమూర్తికి చెప్పానుగూడా"– అంది.

"ఊఁ"- అన్నాను.

"చెప్పాను. వివరించి, వర్ణించి చెప్పాను. కాని, ఆ గంభీరుడు నిబ్బరంగా విని ఊరుకున్నాడు గాని- ఏమీ మాట్లాడలేదు" అంది.

నా గుండెల్లో రాయి పడింది. నేను చిత్తరువు చూచి యింత అవుతున్నానే.... అక్కడ వారికి చీమ కుట్టినట్లయినా లేదా.... ఏమిటో.... యిదేం పరీక్షో. యెందుకు వచ్చిన పరీక్ష !

'హంసి' వినా నాకు మరో మార్గాంతరం కనబడలేదు.

"నా హృదయం వారికి ఎరిగించి, నాపై నెనరు పుట్టింపవా...." అని అడిగాను శుచిముఖిని. ఇంతలో, ఎక్కణ్ణుంచో కిలకిలలు.... తల ఎత్తి చూద్దునుగదా, చిలుక. 'దా' అని చిలుకను పిలిచాను. రాలేదు. రాదు కాబోలు. 'హంసి' చివ్వున ఎగిరి చిలుక దగ్గిర వాలింది. ఓరకంట కనిపెడుతూనే ఉన్నాను. చిలుక హంసికి ఏదో చెప్పింది. హంసి చిలుకను ఏదో అడిగింది. చిలుక రెక్కలలో జాబు! చిలుక హంసికి యిచ్చింది. లేదు, హంసి— ఆ జాబును పుచ్చుకుంది. నెమ్మదిగా ఆ జాబు నా చేతిలో పడింది. ప్రద్యుమ్నులు వ్రాసిన జాబు! శుచిముఖి ముందు హృదయం కంఠస్థానంలో అడ్డుపడి మాట్లాడలేక పోయారుట గాని, మన స్సంతా, మమత అంతా నామీద ఉన్నదట. ఎలాగైనా, నాకు వారిపై ప్రేమ కలిగించాలని వ్రాసి పంపిన దా జాబు.

మనం ప్రేమించిన కాంతుడు, మన ప్రేమ కోరడం ఎంత అదృష్టం! సంతోషం కొద్దీ చిలుకకు పండ్లు, ఫలాలు పెడదాం అనుకున్నాను. చిలుక రివ్వున ఎగిరి వెళ్ళిపోయింది. 'హంసిని' మళ్ళీ బతిమాలుకున్నాను. 'వారు యిక్కడికి వచ్చేట్లు చేయలేవా?' అని.

శుచిముఖి ఓ మాట అంది. నీ తండ్రిగారికి నన్ను గురించి చెప్పి, నన్ను వారి సన్నిధికి వచ్చేట్లు చేస్తే.... అంది. ఇది నిజమే. మా తండ్రి గారి అనుజ్ఞ లేకపోతే, ఎవరూ మా నగరంలో అడుగు పెట్టలేరు మరి. ఏం చెబుతుందో శుచిముఖి, ఎట్లా పన్నుతుందో పన్నాగం. మర్నాడు మాటల సందర్భంలో నాన్నగారికి చెప్పాను. శుచిముఖి అనే హంసి కథ.

నాన్నగారూ వినోద పడ్డారు, చూడాలని!

రోజులు రెక్కలు కట్టుకొని, ఎగిరిపోతున్నాయి!

నాట్య విద్యా ప్రదర్శనం, రాణి వాసం వారుగూడా రావాలని పిలుపు!

శుచిముఖి నా దగ్గిరికి వచ్చింది. నాట్య ప్రదర్శనానికి రావా? అంది. వచ్చి తీరాలంది. రహస్యంగా, గుసగుసగా, అంతరాత్మ ప్రబోధంలాగా, నీ కాంతుడు వచ్చాడు. అతనే నృత్యం చేసేది అంది. నిలువునా వణికాను. నీ వొస్తావని, మీ వారికి చెప్పానే, నామాట కల్లచేస్తావా? చేయకూ? అంది. సరే నన్నాను.

నా అరికాళ్ళు తేలిపోతున్నాయి, నా మాటలు నాకే చిత్రంగా తోస్తున్నాయి. పరీక్షా సమయం దగ్గిరికి! వచ్చేసింది పరీక్ష. నన్ను నేను వదిల పరచుకో గలనా? శుచిముఖీ, నీవు నా దగ్గరే ఉంటావు గద అన్నాను. 'ఆఁ' అంది.

నృత్యం ప్రారంభం అయింది. ఎదుట మహారాజు, మహామంత్రులు. పరివారం, ఎందరెందరో ఉన్నా, నర్తకుని చూపులు వచ్చి వెచ్చగా నా చెంపలమీద తాకుతున్నాయి. ఆయన మాటలు ద్వ్యర్థిగా వినబడుతున్నాయి. ఆయన భంగిమలు - లోకాన్ని జయించే మహావీరుడి విక్రమ నృత్యం లాగుంది గాని, సామాన్యుల నృత్య లీలగాలేదు; నృత్యం పూర్తి అయింది. మంగళ హారతి ఇస్తూ- "నేడే నా కోర్కెల పంట పండుతుంది" అన్నారు వారు.

శుచిముఖి చెప్పింది: యీ రాత్రే ప్రద్యుమ్నులు నన్ను అనుగ్రహిస్తారు. అని—

సూర్యుడు అస్తమించాడు. చుక్కలు పొడిచాయి. నా హృదయ స్పందన నాకే వినబడుతోంది. దీపాలు వెలిగాయి. చీకట్లు తొలిగాయి. నా

కన్నులలోని తళతళ నాకే కనబడుతోంది. మల్లెలు విచ్చాయి. జాజులు పరిమళిస్తున్నాయి. నాకేదో కొత్త కొత్త నెత్తావి లాగుంది. వారు రాలేదు.

పొద్దు పోతోంది. హృదయం గిజగిజలాడుతోంది. వారు రాలేదు.

దాసీ జనం సెలవు తీసుకొని వారి దారిన వారు వెళ్ళారు. వారు రాలేదు.

నన్ను నేను నిందించుకున్నాను.... వారు రాలేదు.

తలపైని తుమ్మెద తిరుగుతున్నట్లుంది. తుమ్మెద ఝుంకృతితోనూ, అదలించాను.

చెవి మీది కెక్కింది. విదిలించాను.

వీర పురుషుడై నిలబడ్డారు; ఎవరో.... వారే! ప్రద్యుమ్నులే!

ఇందాకటినుంచీ ఇక్కడే ఉన్నారన్నమాట! ఇదేం పద్ధతి? చాటుగా, మాటుగా, నటుడుగా, తుమ్మెదగా.... వస్తారా.... ఎంత నేర్పరులైనా.... ఇదంతా నన్ను పరీక్షించడమా....? నా తల నాకు తెలియకుండానే వంగింది.

వారే ఏవో మాట్లాడారు, పలకరించారు. మన్మథుడికి- మాటలుగూడా అస్త్రాలే !

వారు నా చేతిని పరిగ్రహించారు !

రాగవల్లరీ, శుచిముఖీ, ఒక్కసారి, ఒక్క కంఠంగా, 'శుభమస్తు' అన్నారు.

నా హృదయం పెళ్ళి సంగీతం పాడింది!- గాంధర్వ వివాహం!

ఆకాశాన, చందమామ, ప్రసన్నంగా ఆశీర్వదించాడు; జగదంబ, పరమేశ్వరి మాట, యిల్లాగ నిజమైంది.